క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు (కిలో.. రూపాయల్లో...) టమాట 25, పచ్చిమిర్చి 50–60, బెండ 60, కాకర 50, దొండ 50, దోస 50, ఆలు 20, చామ 80, కీర 30, బీర 50, వంకాయ 40, గోకర 60, బీన్స్ 80, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 30, చిక్కుడు 70, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 100, వెల్లుల్లి 100

అగ్రశ్రేణి వర్సిటీగా హెచ్‌సీయూ

రాయదుర్గం: ప్రపంచ వ్యాప్త యూనివర్సిటీ ర్యాంకింగ్స్ ప్రకారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రపంచంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. గ్లోబల్ హయ్యర్ ఎడ్యుకేషన్ అనలిస్ట్ క్యూఎస్ క్వాక్వెరెల్లి సైమండ్స్ విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో హెచ్‌సీయూ సోషియాలజీ, ఇంగ్లీష్ ల్యాంగ్వేజ్, లిటరేచర్‌లో అత్యుత్తమ పనితీరును కనబరిచింది. భారతదేశంలోని వర్సిటీలలో హెచ్‌సీయూ 5వ స్థానంలో ఉంది.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి



పైపులైన్ పనుల ప్రారంభోత్సవంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత సోమిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లలిత సోమిరెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో మిషన్ భగీరథ పైపులైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చిట్టి, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ, నాయకులు ఉమేష్‌లు పాల్గొన్నారు.

27న నిధికి ఆప్ కే నికత్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా ప్రతి నెలా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా నిధి ఆప్ కే నికత్ 2.0 ఈ నెల 27న నిర్వహిస్తారని ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగ్రవాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ని మూడు కేంద్రాల్లో మూడు శిబిరాలు ఉదయం 9.30 నుంచి 5:45గంటల వరకూ నిర్వహిస్తామని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లిలో జీహెచ్‌ఎంసీ ఆడిటోరియం, సంగారెడ్డిలో గాయత్రి హైస్కూల్లో, మెదక్‌లో గీత ఎడ్యుకేషనల్ సొసైటీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యనిధి సమస్యలు ఉన్నవారు పై మూడు కేంద్రాల్లో హాజరై సమస్య పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గపరిధిలో శిథిలావస్థకు చేరుకున్న పురాతన పాఠశాల భవనాలను తొలగించి నూతన భవనాల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ కాలనీలో జేకే పెన్నార్ సంస్థ సహకారంతో 25 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదులను శుక్రవారం సాయంత్రం ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఊరు–మన బడి పథకం ద్వారా ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. పాఠశాల అభివృద్ధికి జేకే పెన్నార్ సంస్థ నిధులు కేటాయించడం పట్ల ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మండల విద్యాధికారి రాథోడ్, జేకే. పెన్నార్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ శర్వణ మార్థాండన్, డాక్టర్ సర్వేశ్, మోహన సుందరం, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: బాలిక అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామానికి చెందిన బాలిక(14) గురువారం ఇంటి నుంచి ట్యూషన్‌కు వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

- పరీక్షలు రాయనున్న 4,626 మంది విద్యార్థులు
- ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు
- శేరిలింగంపల్లి మండలంలో 25 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు



శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్

శేరిలింగంపల్లి: పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధమైంది. శేరిలింగంపల్లి మండల పరిధిలో పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల పరిధిలో 13 ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగా, 83 ప్రైవేట్ స్కూల్స్‌కు చెందిన మొత్తం 4,626 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. విద్యార్థులను పరీక్షలకు ఇప్పటికే ఉపాధ్యాయులు సిద్ధం చేశారు. అన్ని ఉన్నత పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి వారిని మంచిగా చదివేలా, అత్యుత్తమ మార్కులు పొందేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కాగా ప్రీ ఫైనల్ పరీక్షలను కూడా నిర్వహి స్తూ, విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధులను చేస్తున్నారు.

ఏర్పాట్లు ఇవే

- పదవ తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 తేదీన ఆరంభమవుతాయి.
- శేరిలింగంపల్లి మండలంలో 25 పరీక్షా కేంద్రాల్లో 4,626 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశారు.
- పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాల ముందు సీల్డ్ కవర్‌లో ఉన్న పేపర్‌ను తీసేలా ఏర్పాట్లు
- ప్రైవేట్ స్కూల్స్‌లో సీసీ కెమెరాలు ఇప్పటికే ఉండగా, జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో సీసీ కెమెరాలు లేని చోట వాటిని ఏర్పాటు చేస్తారు.
- ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు ఎలా రాయాలో మానసికంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సిద్ధం చేశారు.
- ఆర్టీసీ సంస్థ కూడా విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తోంది. పరీక్షా కేంద్రాల రూట్లలో బస్సుల ట్రిప్పుల సంఖ్య ఆయా సమయాల్లో పెంచాలని నిర్ణయించారు.

శేరిలింగంపల్లి మండలంలో పరీక్షా కేంద్రాలు ఇవే....

- ఎంఎస్‌ఆర్ హైస్కూల్, నాగార్జున హైస్కూల్, విద్యావాణి హైస్కూల్, న్యూ నేషనల్ స్కూల్ (చందానగర్), అక్షయ ఫౌండేషన్ స్కూల్ (నల్లగండ్ల)
- జిల్లా పరిషత్ హైస్కూల్ శేరిలింగంపల్లి, విద్యానికేతన్ స్కూల్ తారానగర్,
- శారద విద్యానికేతన్, ది ఇండో ఇంగ్లీష్ హైస్కూల్ (మియాపూర్), జిల్లా పరిషత్ హైస్కూల్ (మియాపూర్).
- కెపిఆర్ విద్యాలయ (మదీనాగూడ),
- జిల్లా పరిషత్ హైస్కూల్ (కొత్తగూడ), విద్యా హైస్కూల్ (అంజయ్యనగర్ గచ్చిబౌలి)
- న్యూ బ్లూమ్ హైస్కూల్, శ్రీ గౌతమి గ్రామర్ హైస్కూల్, శారదా హైస్కూల్ (కొత్తగూడ),
- జిల్లా పరిషత్ హైస్కూల్ (కొండాపూర్)జీవీఆర్ హైస్కూల్ (కొండాపూర్)
- జిల్లా పరిషత్ హైస్కూల్ (గచ్చిబౌలి),
- జిల్లా పరిషత్ హైస్కూల్ మాదాపూర్, స్వాతి హైస్కూల్ (మాదాపూర్),
- యునైటెడ్ హైస్కూల్, సెయింట్ ఇసాక్ అడ్వంట్ స్కూల్ (న్యూ హాఫీజ్‌పేట్)
- రాయదుర్గం జిల్లా పరిషత్ హైస్కూల్, నాగార్జున పాఠశాల (రాయదుర్గం)లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు

విద్యార్థులకు అన్ని సౌకర్యాలు



శేరిలింగంపల్లి మండలంలో 25 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఈ పదవ తరగతి పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. పూర్తి స్థాయిలో వసతులు ఉన్న స్కూల్స్‌లోనే పరీక్షా కేంద్రాలుగా గుర్తించి ఎంపిక చేశాం. తాగునీటి వసతి, ఫ్యాన్స్, లైట్స్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఏర్పాట్లపై ఆయా కేంద్రాల ప్రధానోపాధ్యాయులతో సమీక్షించాం. ప్రతి రోజూ వారిగా పరీక్షా కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిశీలించి ప్రశాంతంగా పరీక్షలు సాగేలా చేస్తాం.

– కె.వెంకటయ్య, ఎంఈఓ, శేరిలింగంపల్లి మండలం

సునంద భట్టాచార్యకు సెర్బ్ పవర్ ఫెలోషిప్



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ డాక్టర్ సునంద భట్టాచార్యకు 2023 సెర్బ్–పవర్ ఫెలోషిప్ లభించింది. స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మేటిక్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ సునంద భట్టాచార్య పనిచేస్తున్నారు. ఆమెకు 2023–26 కాలానికి సెర్బ్–పవర్ ఫెలోషిప్ లభించింది.

పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న గడీల శ్రీకాంత్‌గౌడ్

పటాన్‌చెరు టౌన్: టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, శనివారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శి గడీల శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఇస్నాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బతుకులు మారి, ఉద్యోగాలు వస్తాయని, తమ కుటుంబం ఆర్థికంగా బలపడుతుందని ఎన్నో కలలు కన్న తెలంగాణ యువతకు కనీసం న్యాయపరంగా పరీక్షలు రాసే వీలులేకుండా పోవడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవేందర్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి కావళి వీరేశం, ఎస్‌ఆర్‌కె యువసేన సభ్యులు షకీల్, దుర్గా సాయి, రాజు, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు రూ.లక్ష నష్టపరిహారం ప్రకటించాలి

పటాన్‌చెరు టౌన్: పేపర్ లీకేజీ నిందితులపై కఠిన చర్యలు తీసుకొని, రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని పటాన్‌చెరు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పేపర్ లీకేజీ ఘటన పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోకన్వీనర్ శ్రీనివాస్ గుప్తా, జిల్లా కార్యవర్గ సభ్యులు మురళీధర్ వర్మ, డివిజన్ సలహాదారు కొండయ్య, ఉపాధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, బాలరాజ్, శివయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శోభకృత్ ఉగాది కేలెండర్ ఆవిష్కరణ



మసీదుబండలోని బీజేపీ కార్యాలయంలో ఉగాది కేలెండర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

గచ్చిబౌలి: ఉగాది పర్వదినం సందర్భంగా శోభకృత్ నామసంవత్సరాన్ని పురస్కరించుకొని నూతనంగా రూపొందించిన ఉగాది కేలెండర్‌ను ఆవిష్కరించారు. విశ్వహిందూ పరిషత్ రంగారెడ్డిజిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ సమక్షంలో ఈ కేలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మసీదుబండలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పృథ్వీరాజ్‌గౌడ్, సంతోష్, కృష్ణంరాజు, బాలాజీ, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

30న టెలికాం నగర్ ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు

రాయదుర్గం: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి దేవాలయంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ధర్మగారి రవీందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆలయంలో ఈనెల 30న ఉదయం 6 గంటలకు షిర్డీసాయిబాబా కాగడ హారతితో వేడుకలను ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు బాబా వారికి మంగళస్నానాభిషేకం, పంచామృతాభిషేకం, 9 నుంచి 10 గంటల వరకు సాయి అష్టోత్తరపూజలు, విష్ణుసహస్ర నామ, లక్ష్మీ అష్టోత్తర సాయి సహస్రనామ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆలయ నిర్వాహకులు డి నరేందర్‌రెడ్డి, అర్చకులు వీవీవీఎస్‌శర్మ పర్యవేక్షణలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సీతారామ కళ్యాణమహోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు ప్రసాద వితరణ, అన్నసమారాధాన కార్యక్రమం, సాయంత్రం 4 గంటలకు సాయిబాబా, సీతా రాముల వారి శోభాయాత్ర, సాయంత్రం షిర్డీసాయి బాబా సంధ్యాహారతి, ఆలయంలో రాత్రి 7 నుంచి 9 గంటల వరకు భక్తులతో భజన కార్యకర్తలతో ప్రత్యేక భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాత్రి ఆలయంలో శేజ్ హారతితో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

హలీమ్ తయారీలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలి



హలీమ్ తయారీదారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన దృశ్యం

గచ్చిబౌలి: రంజాన్ మాసం సందర్భంగా అందరూ ఇష్టంగా తినే'హలీమ్' తయారీలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ శంకరయ్య తయారీదారులకు సూచించారు. శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ పరిధిలో హలీమ్ తయారీదారులు, పోలీసు, జీహెచ్‌ఎంసీ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హలీమ్ తయారీలో ప్రత్యేకత, ప్రజాదరణను నిలుపుకోవడానికి, నాణ్యత, భద్రత, ఆరోగ్య ప్రమాణాలను పాటించేందుకు పలు ఆదేశాలతో కూడిన ఉత్తర్వులు జారీ చేశామన్నారు. హలీమ్ తయారీకి బట్టీలను గ్రౌండ్ ఫ్లోర్‌లో మాత్రమే ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వినియోగదారులకు పార్కింగ్ సదుపాయం కల్పించాలని, సాయంత్రం వేళల్లో వాహనాలు వెళ్ళేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో సైబరాబాద్ జాయింట్ సీపీ మల్లారెడ్డి, డీసీలు వెంకన్న, సుధాంశు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న పెయింటింగ్స్



మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్‌గ్యాలరీలో కళాకారులు వేసిన చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం రెండు వేర్వేరు ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ఫ్లూరల్ పేరిట ఏర్పాటు చేసిన గ్రూప్ ఎగ్జిబిషన్‌ను హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రమణారెడ్డి ప్రారంభించారు. ఈనెల 26వ తేదీ వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.

- ఓ క్రిడ్జి ఇంటర్‌నేషనల్ విద్యార్థులు 6వ తరగతి, 11వ తరగతి విద్యార్థులు వేసిన చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు. తెలుగు యూనివర్సిటీ హైదరాబాద్ ప్రింట్ మేకింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రిష్ణారెడ్డి ప్రారంభించారు.





రఘునాథ్‌యాదవ్‌కు పలువురి జన్మదిన శుభాకాంక్షలు



రఘునాథ్‌యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

గచ్చిబౌలి: బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి మారబోయిన రఘునాథ్‌యాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొండాపూర్ డివిజన్‌లో సిద్ధిఖ్‌నగర్, మసీదుబండలోని ఆయన నివాసంలో ఆయన జన్మదిన వేడుకలను బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలతో కోలాహలంగా మారింది. అనంతరం ఆయనను పూలమాలలు, శాలువాలతో సత్కరించి ఆయన జన్మదినశుభాకాంక్షలు తెలిపే వారితో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. సిద్దిఖ్‌నగర్‌లోని ఎల్లమ్మ దేవాలయంలో రఘునాథ్‌యాదవ్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రత్యేక పూజలను నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం దేవాలయ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శిరీష ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ మారబోయిన రాజుయాదవ్, మేనేజింగ్ డైరెక్టర్ మారబోయిన సాయిరామ్‌యాద తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలి

శేరిలింగంపల్లి: ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని నేతాజీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రాంచందర్‌యాదవ్ సూచించారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని నేతాజీ నగర్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. నీరులేకపోతే మనం లేమని అలాగే నీటిని ప్రతి ఒక్కరూ సరైన పద్ధతిలో వినియోగించుకోవాలన్నారు.

రేపు 'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటలకు రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ముఖ్యంగా ఉగాది, శ్రీరామనవమి పర్వదినాలకు పురస్కరించుకొని 'ఫెస్టివల్ ఆఫ్ ఇండియా..కంట్రిబ్యూషన్స్ టువర్డ్స్ మెంటల్ వెల్‌బీయింగ్' అనే అంశంపై హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సైకాలజిస్ట్ బి.కె.రామకృష్ణ ద్వారా ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

భగత్‌సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి



భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు శంకర్

కూకట్‌పల్లి: భగత్‌సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లామని సీపీఎం కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం.శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం హైదర్‌నగర్ పార్టీ శాఖ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ ఆటోస్టాండ్ వద్ద భగత్‌సింగ్ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శంకర్, కార్యదర్శి వి.శివప్రసాద్, సభ్యులు రాజారావు, ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయస్సులోనే ప్రాణ త్యాగం చేశాడన్నారు. భగత్‌సింగ్ చిన్న వయసులోనే జలియన్ వాలాబాగ్ ఉదంతం చూసి చలించిపోయాడన్నారు. అతిచిన్న వయసులోనే రాజ్‌గురు, సుఖదేవ్, భగత్‌సింగ్‌లకు బ్రిటీష్ ప్రభుత్వం ఉరిశిక్ష వేసిందన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, కృష్ణనాయక్, సత్తయ్య, నాగేశ్వరరావు, వీరయ్య, ఎల్‌డీ ప్రసాద్, మహేష్, శ్రీను, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై రాస్తారోకో, నిరసన



నరేంద్రమోడీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మియాపూర్: కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసినందుకు శేరిలింగంపల్లి కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో చందానగర్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. చందానగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం టీపీసీసీ జనరల్ సెక్రెటరీ జెరిపెటి జైపాల్, కాంగ్రెస్ నాయకులతో కలిసి కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం చేసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు రాజేందర్, కవిరాజ్, రాజన్, శేఖర్, కార్తీక్, సాయి ముదిరాజ్ తదితరులున్నారు.

బోధన, పరిశోధనల్లో మార్పులు రావాలి



గచ్చిబౌలిలోని ఎస్కీలో నిర్వహిస్తున్న సదస్సుకు హాజరైన వక్తలు

రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో మూడు రోజులపాటు సాగే సదస్సు కొనసాగుతోంది. రెండవ రోజైన శుక్రవారం 'ఉన్నత విద్యారంగంలో నాణ్యత, సూచికలు' అనే అంశంపై పలువురు వక్తలు ప్రసంగించారు. ముఖ్యంగా ఉన్నత విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా బోధన, పరిశోధనల్లో కూడా మరిన్ని మార్పులు రావాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 150 మంది ప్రతినిధులు, 35కు పైగా ఉన్నత విద్యాసంస్థల ప్రతినిధులు వర్చువల్ మోడ్‌లో పాల్గొన్నారు. పలువురు విద్యార్థులు వివిధ అంశాలపై తమ పేపర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సదస్సులో లండన్, పోలాండ్, ఇండోనేషియా, మలేషియా, జర్మనీ, ఇండియా, థాయిలాండ్‌లకు చెందిన అంతర్జాతీయ ప్రముఖులు కూడా ఆన్‌లైన్‌లో కూడా పాల్గొన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.